

ఇల్లందకుంటలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఇల్లందకుంట: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాల యంలో జరిగే బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ఏకాంతసేవతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు మంత్రోచ్ఛరణ నడుమ స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో అధిరోహించి గరుడ సేవలు చేపట్టారు.



ఏకాంత సేవ నిర్వహిస్తున్న అర్చకులు

లక్కీడ్రా ద్వారా మున్సిపల్ షాపుల కేటాయింపు


● నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ వద్ద ఉన్న నగర పాలక సంస్థకు చెందిన షాపులను బుధవారం లక్కీ డ్రా ద్వారా నగర పాలక సంస్థ కమిషర్ చాహత్ బాజ్‌పాయ్ కేటాయించారు. 26 షటర్లకు గాను 261 మంది వ్యాపారులు దరఖాస్తులు చేసుకోగా నిబంధనల ప్రకారం లక్కీ డ్రా



డ్రా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

తీసి షాపులను కేటాయించారు. కళాభారతిలో బుధవారం నగరపాలక సంస్థకు చెందిన శాతవాహన యూనివర్సిటీ సమీపంలో గల షటర్లకు లక్కీడ్రా నిర్వహించారు. ఎస్సీ కేటగిరికి 4 ఎస్టీ కేటగిరి 2 వికలాంగుల కేటగిరికి 1 నాయీబ్రాహ్మణ కేటగిరీ 1 కేటాయించగా మిగిలిన వాటిని జనరల్ కేటగిరీలో డ్రా పద్ధతిలో కేటాయించారు. షాపులు దక్కించుకున్న వారు వారం రోజుల్లో నగరపాలక సంస్థతో అగ్రిమెంట్ చేసుకోవాలని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని 26 షాపులకు లక్కీడ్రా నిర్వహించామని తెలిపారు. గతంలో నగరపాలక సంస్థకు చెందిన షాపులను పొందిన వారికి అవకాశం ఇవ్వకుండా కొత్త వ్యాపారులకు కేటాయించినట్లు తెలిపారు.నగరపాలక సంస్థ షాపులు పొందిన వారు వేరే ఇతరులకు అద్దెకు కేటాయిస్తే సంబంధించిన షాపు యజమాని అగ్రిమెంట్ రద్దు చేసి వేరేవారికి కేటాయిస్తామని తెలిపారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం షాపులను ఇతరులకు అద్దెకు ఇవ్వ రాదని తెలిపారు. ఈ లక్కీడ్రాలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, ఆర్వో భూమానందం, రెవెన్యూ సిబ్బంది భూమయ్య పాల్గొన్నారు.



నేటి నుంచి 'భూ భారతి' సదస్సులు

- చట్టంపై అవగాహన కార్యక్రమాలు
- అన్ని మండలాల్లో నిర్వహణ
- కార్యక్రమం రూపొందించిన జిల్లా యంత్రాంగం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెవెన్యూ చట్టాలను మార్చి ధరణిని అమల్లోకి తెచ్చారు. ధరణి చట్టం తెలంగాణ ప్రజలకు పీడ కలగా మారిందని తాము అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తామని చెప్పిన కాంగ్రెస్ కొత్తగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకు వచ్చింది. ధరణి స్థానంలో భూభారతి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో భూభారతి చట్టాన్ని అమలు చేస్తూ ఆయా మండలాల్లో వచ్చిన సూచనలు, సమస్యలను పరిశీలించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అమల్లోకి తీసుకురానున్నారు. భూభారతితో తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొత్త భూ భారతి చట్టం పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకువస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ చట్టంపై సమగ్ర అవగాహనను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయిల్లో సదస్సులు నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు నోడల్ అధికారులుగా, మండల తహసీల్దార్లు సదస్సు నిర్వహణ బాధ్యులుగా వ్యవహరిస్తారు. ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు తిమ్మాపూర్ రైతు వేదికలో తిమ్మాపూర్ మండల స్థాయి సదస్సు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి గన్నేరువరంలో శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో సదస్సు జరుగనుంది. ఈ నెల 19న హుజూరాబాద్‌లో ఉదయం 10.30 గంటల నుంచి సాయిరూప గార్డెన్‌లో, 22న రామడుగు రైతు వేదికలో ఉదయం 10.30 గంటలకు, గంగాధర రైతు వేదికలో 12 గంటలకు భూభారతి సదస్సులు నిర్వహిస్తారు. చొప్పదండి మండల కేంద్రంలో ఈ నెల 23న రైతు వేదికలో సదస్సు జరగనున్నది. 24న మానకొండూర్ రైతు వేదికలో ఉదయం 10.30గంటలకు శంకరపట్నం మండలం వంకాయగూడెంలో మాదవ సాయిలో మధ్యాహ్నం 12 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తారు. 25న ఉదయం జమ్మికుంటలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంలో, ఇల్లందకుంటలో మధ్యాహ్నం 12 గంటలకు రైతు వేదికలో ఈ సదస్సులు నిర్వహిస్తారు. కరీంనగర్ రూరల్ మండలంలో 26న ఉదయం దుర్శేడ్ రైతు వేదికలో, కొత్తపల్లి మండలంలో అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో సదస్సులు జరుగుతాయి. 29న చిగురుమామిడి మండలంలోని రైతు వేదికలో ఉదయం, సైదాపూర్ మండలంలో అదే రోజు మధ్యాహ్నం సదస్సులు నిర్వహిస్తారు. వీణవంక మండల రైతు వేదికలో 30వ తేదీన ఉదయం 10.30గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తారు.

● పెండింగ్ సమస్యల పరిష్కారానికి అవకాశం

ధరణి చట్టంలో ఆర్ఓఆర్ మ్యుటేషన్‌లో వివాదాలు ఉంటే కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. ఈ వివాదాలపై అప్పీల్ చేసుకునే అవకాశం లేదు. భూ భారతిలో అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు, వారం రోజుల గడువుతో నోటీసులు ఇచ్చి సమస్యను పరిష్కరించడానికి వీలుంది. ధరణి కారణంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను ఈ కొత్త చట్టం ద్వారా పరిష్కరించేందుకు వీలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా సాదా బైనామాల ద్వారా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్‌లను ఈ చట్టం ద్వారా పూర్తి చేసి పట్టాదారు పాసుబుక్‌లు ఇస్తారని, భూ వివాదాల కారణంగా ధరణిలో కనిపించకుండా పోయిన సర్వే నెంబర్ల సమస్య పరిష్కారమై ఆయా రైతులకు పట్టాదారు పాసు పుస్తకం చేతికి రావడంతో పాటు భూమిపై హక్కులు పొందడానికి ప్రభుత్వం అందించే లబ్ధి పొందడానికి వీలు కలుగుతుందని చెబుతున్నారు. ఈ అంశాలతో పాటు పలు అంశాలు భూ భారతి అవగాహన సదస్సుల్లో చర్చకు వచ్చి రైతులకు సంపూర్ణ అవగాహన చేకూరుతుందని అధికారులు అంటున్నారు. వీలునామా, వారసత్వ మ్యూటేషన్‌లకు తహసీల్దార్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. భూములపై హక్కున్నా రికార్డుల్లో నమోదు కాకపోయినా సరి చేసుకునే అవకాశం ఉన్నది.

రైతులకు కష్టం రాకుండా చూస్తాం

- ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం
- బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రైతులకు ఏ కష్టం రాకుండా చూస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం మంత్రి సైదాపూర్ మండలంలో ఐకేపీ ద్వారా నిర్వహించే సోమారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం ద్వారా నిర్వహించే సైదాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎక్కడైనా ధాన్యం కొనుగోలు కేంద్రం అవసరముంటే మంజూరు చేయిస్తామన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోవద్దన్నారు. ఇప్పుడు కూడా సన్న వడ్లకు రూ. 500ల బోనస్ ఇస్తున్నామని, గతంలో ఎవరికైనా సన్నవడ్ల బోనస్ రాకపోతే అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకరావాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో సన్న బియ్యం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిం చారు. రైతులకు సమస్యలు రాకుండా ధరణి స్థానంలో భూభారతి తీసుకవచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణపై చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని, దేశంలోనే మొదటి సారి చట్టం తెచ్చామన్నారు. బీసీ కుల గణన చేశామని, రిజర్వేషన్ల పంపునకు చట్టం తెచ్చామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో రాజకీయ జోక్యం ఉండదని తెలిపారు. మంచి నీటి కొరత ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రామాలలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, ఆర్డీవో రమేష్, తహసీల్దార్ మంజుల, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, మహిళలు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సైదాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కోతలు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కోతలు లేకుండా కొను గోళ్లు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్, తుమ్మనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా తూకం, తేమ యంత్రాల పనితీరును పరిశీలించారు. మిల్లింగ్‌కు పంపే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తేమ, తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏడీఏ సునీత, ఏఈవో సౌమ్య తదితరులున్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేనిచో ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని కరీంనగర్ శాసన సభ్యుడు గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరందక పంటలు ఎండిపో యినా రైతులకు ప్రభుత్వం 500 బోనస్ చెల్లించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు, ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. మల్కాపూర్ గ్రామాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేయడం ద్వారా ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కరువైందన్నారు. రైతుబంధు, సబ్సిడీ గ్యాస్ అందడం లేదన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. చివరితడి నీరు అందక పంటలు ఎండిపోయా యన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కాసారపు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ వైస్‌చైర్మన్ ఉప్పు రాజశేఖర్, సాబీర్ పాషా, పండుగ గంగమ్మనర్సన్న, లసుమయ్య, ఉప్పు శ్రీనివాస్, కర్ర సూర్యశేఖర్, నేతి రవివర్మ పాల్గొన్నారు.



బద్దిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహిళలుపౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై 25 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోషణ జాతర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భం గా పిల్లల పెరుగుదల, పర్యవేక్షణ, చేతుల పరిశుభ్రత గురించి వివరించారు. గర్భిణులు, మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన కూరగాయల సంతను పరిశీలించి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సబిత, మెప్మా పీడీ వేణు మాధవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులు ఏర్పాటు చేసిన కూరగాయల సంతను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

● విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి..

హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపులోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. తరగతి, వంట గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.



హుజూరాబాద్‌లో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

● మున్సిపాలిటీ ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్..

హుజూరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మొక్కలు నాటారు. తడి, పొడి చెత్త సేకరణ గురించి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏవో భూపాల్‌రెడ్డి, సాంబరాజు, అశ్విని గాంధీ, రషీద్, శ్రీకాంత్, కిషన్‌రావు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కరీంనగర్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి ● కేంద్ర మంత్రులకు బండి సంజయ్ వినతి 7

ఉపాధి కల్పనలో రెండోస్థానం ● లక్ష్యాన్ని మించిన పనిదినాలు 8

గ్రూపు-1 ఫలితాల్లో అవకతవకలు

● ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 ఫలితాల్లో అవకతవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేయాలని హుజురా బాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నగరంలోని ఎమ్మెల్యే గంగుల కమలా కర్ నివాసంలో ఆయనతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 654 మంది అభ్యర్థులకు ఒకే సీరిస్‌లో సమానంగా మార్కులు వచ్చాయని ఆరోపించారు. రాములు నాయక్ చాలెంజ్‌ను స్వీకరిస్తున్నానని అన్నారు. టీజీపీఎస్సీ మల్టీజోన్‌లో మొదటి ర్యాంకు రాములు నాయక్ కోడలుకు వచ్చిందని తెలిపారు. తన కోడలు రోజుకు 18 గంటలు చదివిందని రాములు నాయక్ చెప్పారని ఆయన కోడలు మాత్రం రోజుకు కేవలం 5 గంటలే చదివానని చెబుతోందని, వారిద్దరిలో ఎవరి మాట నమ్మాలో తెలియడం లేదన్నారు. రాములు నాయక్‌కు గాంధీభవన్ నుంచి ముందే పరీక్ష పేపరు వచ్చిందని తీవ్రమైన ఆరోపణలు చేశారు. కోఠి మహిళా కళాశాలలో ఖచ్చితంగా ఎగ్జామ్ స్కాం జరిగిందని ఆరోపించారు. ఒక అమ్మాయి రీ కౌంటింగ్ అడిగితే 20 మార్కులు తగ్గాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్కాముల ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఈ అంశంపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దీనిపై సీబీఐచే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్ష రాసిన వారికి తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తే తమకు ఉద్యోగాలు వచ్చేవని, తమకు న్యాయం జరిగేలా చూడాలని అభ్యర్థులు ప్రతిపక్ష నాయకుల వద్దకు వస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో కౌశిక్‌రెడ్డి వద్దకు కూడా బాధితులు వెళ్లారని తెలిపారు. కౌశిక్‌రెడ్డి సవాలును ప్రభుత్వం స్వీకరించి, జ్యుడీషియల్ విచారణ కానీ, కేంద్ర విజిలెన్స్ ద్వారా లేదా సీబీఐ ద్వారా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి

● పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల దృష్ట్యా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేవారు, అలాగే బస్సుల్లో ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం తెలిపారు. ఈ మేరకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఊరెళ్లేవారు ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగ దును బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోవాలని లేదా సురక్షితంగా దాచుకోవాలని సూచించారు. ఇంటి బీరువా తాళాలను తమ వెంట తీసుకువెళ్లాలని, విలువైన వస్తువులు, వ్యక్తిగత విషయాలను ఇత రులతో పంచుకోకూడదని హితవు పలికారు. ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఐపీ సీసీ కెమెరాల ద్వారా ఇంటి పరిసరాలను మొబైల్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చని తెలిపారు. బయట గేటుకు తాళం వేయకుండా లోపలి నుండి గొళ్లెం పెట్టాలని, ఇంటి లోపల, బయట లైట్లు వేసి ఉంచాలని సూచించారు. అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు లేదా వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరిగా పేర్కొన్నారు. ఇళ్లకు తాళం వేసి ఊర్లకు వెళ్లే ముందు చుట్టుపక్కల వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, కాల నీలు, అపార్ట్‌మెంట్ పరిసరాల్లో అను మానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక నివాసితులు సంఘాలుగా ఏర్పడి రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని, దొంగతనాలను అరికట్టడానికి 50 నుంచి 100 మందితో కూడిన సంఘాలు ఏర్పడి వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరిస్తే నేరాలను నియంత్రించవచ్చని సీపీ తెలిపారు. వేసవి సెలవులకు ఊర్లకు వెళ్లేందుకు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా సీపీ వివరించారు. ప్రయాణికులు తమ విలువైన వస్తువులైన డబ్బు, ఫోన్, లాప్‌టాప్‌లను తమ ముందు పెట్టుకున్న బ్యాగులో లేదా ఒంటికి దగ్గరగా ఉంచుకోవాలని, బ్యాగులు పూర్తిగా మూసి ఉంచాలని సూచించారు. వెనుక జేబుల్లో వస్తువులు పెట్టుకోకూడదని, అపరిచితులను నమ్మవద్దని హెచ్చరించారు. సురక్షితమైన ప్రయాణం కోసం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

తండ్రిని చితకబాదిన కొడుకుపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పొలం అమ్మగా వచ్చిన డబ్బులను తనకు ఇవ్వాలని కన్న తండ్రిని చితకబాదిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన వేముల రాజుపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. గ్రామంలోని వేముల సత్తయ్య అతని కొడుకు రాజుతో కలిసి జీవిస్తున్నాడని పేర్కొన్నారు. మూడేళ్ల కిందట సత్తయ్య పేరిటఉన్న పొలాన్ని అమ్మగా రూ.18 లక్షలు వచ్చాయని చెప్పారు. ఆ డబ్బులు నుంచి సత్తయ్య తన కొడుకు రాజుకు రూ.12లక్షలు ముట్టచెప్పాడని పేర్కొన్నారు. ఈనెల 15న మిగిలిన డబ్బులు తనకు ఇవ్వాలని తండ్రి సత్తయ్యతో గొడవకు దిగాడని, అంతటితో ఆగని రాజు బండరాయితో దాడి చేశాడని పేర్కొన్నారు. తీవ్ర గాయాలపాలైన సత్తయ్యను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. బాధితుడి కూతురు పిట్టల రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

కొడుకు తిండి పెట్టడం లేదు..

- తహసీల్దార్‌కు మొరపెట్టుకున్న మాజీఎంపీటీసీ

శంకరపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాను కష్టపడి సంపాదించిన భూమి సాగు చేసుకుంటూ.. తాను నిర్మించిన ఇంట్లో ఉంటూ తనకు కనీసం తిండి పెట్టడంకుండా తన కొడుకు ఇబ్బందులు పెడుతున్నాడని రాజాపూర్ మాజీ ఎంపీటీసీ ఆసరి అయిలయ్య శంకరపట్నం తహసీల్దార్‌కు బుధవారం గోడువెల్లబోసుకున్నాడు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను సంపాదించిన భూమి, ఇంటిని తిరిగి ఇప్పించాలని వేడుకున్నారు. కాగా ఆసరి అయిలయ్య స్థితిగతులు తెలుసుకున్న తహసీల్దార్ భాస్కర్ గ్రామంలో విచారణ చేయాలని ఆర్ఐ బాలకిషన్‌ను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జమ్మికుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో ట్రాక్టర్, బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పద్మశాలి వీధికి చెందిన పెరుమాండ్ల సుధాకర్ బైక్‌పై దినేష్ ఫంక్షన్‌హాల్‌లో ఓ శుభ కార్యానికి హాజరై జమ్మికుంట వైపు వస్తున్నాడు. అదేరోడ్డులో ట్రాక్టర్ (టిఎస్ 022 7910) మక్కల లోడుతో వేగంగా వస్తోంది. ట్రాక్టర్‌ను ఓవర్‌టెక్ చేసే క్రమంలో ట్రాక్టర్ ముందు భాగం బైక్‌కు తగిలింది. దీంతో బైక్‌పైనున్న సుధాకర్ కింద పడిపోయాడు. ట్రాక్టర్ ముందు బైక్‌పైకి ఎక్కడంతో లోడుతో ఉన్న ట్రాక్టర్ వెనుకభాగం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన అతన్ని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.



పాడి రైతులు పారాహుషార్

- ఎండల వేళ పశువులు జాగ్రత్త
- వడదెబ్బ నుంచి రక్షణ కల్పించాలి

చొప్పదండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండల వేళ పశుపోషణలో మెళకువలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పశువుల పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్ల అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడ దెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువుల సరిగ్గా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్నజీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. ఎండ వేడిమికి దాణా సరిగా తినకపోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుంచి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

పాకల్లో చల్లదనం కోసం ఏర్పాట్లు

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకులను పరచడం లాంటి చర్యల ద్వారా ఎండ వేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చూట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తరచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లు ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గాలి ధారాళంగా ప్రసరించే విధంగా చూడాలి. పశువులను రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలి.



మెళకువలు పాటించాలి

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో మెళకువలు పాటిస్తేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ వంటివి అందించాలి. ఎక్కువశాతం పచ్చిగడ్డి అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాతో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే వేసవిలో పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీళ్ల తాగేలా చూడాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. కళ్లలో ఎర్రటి చారలు, నెమరు వేయలేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని తాగునీటిని అందించాలి. రైతులు వెంటనే పశు వైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి.

వాహనాలను సీజ్ చేసిన అధికారులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం షానగర్ ఎల్లమ్మ చెరువులో చేపడుతున్న తవ్వకాలను ఇరిగేషన్ అధికారులు నిలిపివేశారు. ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కాగా ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈఈ సుధాకర్ ఆదేశాలతో ఏఈ రఘురామ్ ఇతర సిబ్బందితో ఎల్లమ్మ చెరువుకు తరలవచ్చి వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మూడు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేసినట్లు ఏఈ రఘురాం తెలిపారు. పరిమితికి మించి ఎక్కువగా తీసిన తవ్వకాలపై ఫైన్ వేసినట్లు ఆయన వివరించారు.



పట్టుకున్న వాహనాలతో ఏఈ

కోతకు వచ్చిన ఆయిల్ పామ్ గెలలు

- మొదటి కాత మూడు టన్నుల దిగుబడి



ఆయిల్ పామ్ గెలలతో రైతులు, సంస్థ ప్రతినిధులు

మానకొండూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగురుపల్లి గ్రామానికి చెందిన నందిగొండ ముత్తారెడ్డి అనేరైతు తనకున్న 5.30 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేశారు. మూడేళ్ల రెండు నెలలకు గెలలు పక్వానికివచ్చి మొదటి సారి కోతకు వచ్చింది. ఒప్పందంలో భాగంగా మొక్కలను అందించిన లోహియా ఎడిబిల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు కొనుగోలుచేశారు. మొదటిసారి మూడు టన్నుల దిగుబడిరాగా టన్నుకు రూ.21వేల ధర పలికింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రోత్సహకాలు అందజేసి ప్రతిష్టాత్మకంగా ఆయిల్‌పామ్ పంటను సాగుచేయిగా చేతికి వచ్చిన పంటను సంస్థ కొనుగోలు చేయడం సంతోషదాయకమని రైతు ముత్తారెడ్డి తెలిపారు. దిగుబడి క్రమంగా పెరుగుతుందని రైతు తెలిపాడు. కూలీల ఖర్చు లేకుండా ఇతర పంటలకు ప్రత్యామ్నాంగా ఆయిల్ పామ్ పంటను సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందన్నారు. గెలలను కొనుగోలుచేసిన వారం రోజులకు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు సంస్థ మేనేజర్ కే. విజయభరత్ తెలిపారు.

మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత

ఓదెల ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూర్‌కు చెందిన జిగురు ఓదెలు అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రతిమమెడికల్‌కళాశాలకు పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు. మృతుడికోరిక మేరకు కుటుంబ సభ్యులంతా మృతదేహాన్ని అప్పగించేందుకు నిర్ణయించుకోగా కొలనూర్‌లో సదాశయ ఫౌండేషన్, సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యకళాశాలకు అప్పగించారు. గతంలో జిగురు ఓదెలు, అతడి భార్య కనకలక్ష్మి దేహదానానికి అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని ఆచరణలో పెట్టడం పలువురికి స్ఫూర్తిదాయకమని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి భీష్మచారి తెలిపారు. అలాగే వైద్యకళాశాలకు మృతదేహాన్ని దానం చేయడంపై కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాష కోవిదుడు నలిమెల భాస్కర్, వైద్య కళాశాల డీన్, సీఈవోలు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.



ప్రతిమ వైద్యకళాశాలకు మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన విద్యార్థి



మెక్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ సునీల్ కుమార్

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో 9వతరగతి చదువుతున్న జోయల్ మెక్ పియానో వాయించడం పోటీల్లో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించాడు. 2024డిసెంబర్ 1న నిర్వహించిన ప్రపంచస్థాయి మ్యూజిక్ ప్రదర్శనల్లో కీబోర్డు సంగీత కళాకారుల బృందం ఒకగంటలో 1046వీడియోలు అప్‌లోడ్‌చేసి ప్రపంచ రికార్డుసాధించింది. ఈ బృందంలో జోయల్‌మెక్ ఉన్నాడు. పాఠశాల కరస్పాండెంట్ వై సునీల్‌కుమార్ విద్యార్థిని అభినందించాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే గిన్నిస్‌రికార్డులో చోటు సంపాదించుకున్నానని విద్యార్థి తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాజేశం (ఫైల్)

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలోని కునారం రోడ్డువద్ద బుధవారం జరిగినరోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. చీకురాయి రోడ్డుకుచెందిన నాగులమల్యాల రాజేశం (59) ఉదయ్‌నగర్ నుంచి బస్టాండ్‌వైపు మోపెడ్‌పై వెళుతున్నాడు. రాజీవ్‌రహదారిపైకి వచ్చే క్రమంలో వెనుకనుంచి వచ్చిన లారీ(టీజీ35 టీ 1125) ఢీకొట్టింది. దీంతో మోపెడ్‌పైనుంచి కిందపడిన రాజేశం తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులుహుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపే రాజేశం మృతిచెందాడు. పోలీసులు లారీని పోలీస్‌స్టేషన్ తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించలేకపోయానని యువతి ఆత్మహత్య



ప్రత్యూష(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం సాధించ లేకపోయాననే మనస్తాపంతో పెద్దపల్లిజిల్లా గోదావరిఖని పవర్ హౌస్‌కాలనీకి చెందిన చుంచు ప్రత్యూష(26) అనే యువతి మంగళ వారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రత్యూష తండ్రి విఠల్ గోదావరిఖని బస్టాండ్ సమీపంలో టీస్టాల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముగ్గురు కూతుర్లు కాగా, ఇద్దరు కూతుర్లకు వివాహం జరిపించాడు. చిన్న కూతురు ప్రత్యూష పీజీ చదివి పలు పోటీపరీక్షలకు హాజరవుతోంది. ఉద్యోగం సాధించ లేకపోయాననే మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు యువతితండ్రి విఠల్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ భూమేష్ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒంటరి జీవితంతో వేగలేక మద్యానికి బానిసై జీవితంమీద విరక్తిచెందిన ఓవ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రామడుగులో జరిగింది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన కావలి భూమయ్య(55) 25సంవత్సరాలుగా భార్యాపిల్లలకు దూరమై ఒంటరిగాతల్లితో ఉంటున్నాడు. నాలుగుసంవత్సరాల క్రితం తల్లి సైతం వృద్ధాప్యంతో మృతిచెందగా ఒంటరివాడైన భూమయ్య మద్యానికి బానిస అయ్యాడు. జీవితం విరక్తి చెందిన ఆయన 15వ తేదీన సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. 16న ఉదయం తాటివనంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుసుకున్న బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి అన్న కొడుకు కావలి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ముఖ్యమంత్రిని కించపరిచిన కేసులో..

- నిందితుడిని విచారించిన గోదావరిఖని సైబర్‌క్రైమ్ పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన కేసులో నల్ల బాలు అనేవ్యక్తిని బుధవారం గోదావరిఖని సైబర్‌క్రైమ్ పోలీసులు విచారించారు.మార్చి16న సైబర్ క్రైమ్‌పోలీస్‌స్టేషన్‌లో సుమోటో కేసు నమోదైంది. ఈకేసులో బాలు న్యాయవాదితోపాటు బీఆర్ఎస్ నాయకులు కోరుకంటి చందర్, కౌశికహరితోకలిసి సైబర్‌క్రైమ్‌పోలీసుల ఎదుట హాజరయ్యారు. సైబర్‌క్రైమ్ ఎస్‌హెచ్ఓ డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో నిందితుడు నల్ల బాలును విచారించారు.

ఆపరేషన్ చేస్తుండగా కార్మికుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యం అంటూ బంధువుల ఆందోళన

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాలు విరిగి శస్త్రచికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన నేతకార్మికుడు ఆపరేషన్ థియేటర్లో కార్డియో అరెస్టుతో మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణం 25వ వార్డు పద్మానగర్‌కు చెందిన బైరి చంద్రయ్య (65)పవర్‌లూం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చిన చంద్రయ్య నడుచుకుంటూ రోడ్డుపై కుప్పకూలిపోయాడు. బంధువులు పట్టణంలోని సిరి మల్టీస్పెషల్ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యపరీక్షలు చేసిన ఆసుపత్రి వైద్యులు చంద్రయ్యకు తుంటి ఎముక విరిగిందని శస్త్ర చికిత్స(ఆపరేషన్) చేసి రాడువేయాలని సూచించారు. ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి వైద్యులు అన్నిరకాల పరీక్షలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం చంద్రయ్య కాలుకు ఆపరేషన్ కోసం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన గంట తరువాత చంద్రయ్యకు పల్స్ పడిపోయిందని, క్రిటికల్‌గా ఉందంటూ వైద్యులు చంద్రయ్య బంధువులకు తెలిపారు. అరగంట తరువాత కార్డియో అరెస్టు అయి చంద్రయ్య మృతిచెందాడంటూ వెద్యులు తెలపడంతో ఆ కుటుంబం షాక్‌కు గురైంది. ఆపరేషన్‌కు ముందు అందరితో మాట్లాడిన వ్యక్తి మృతిచెందాడంటూ వైద్యులు తెలపడంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని ఆందోళన చేపట్టారు. థియేటర్లో ఆపరేషన్ వికటించే మరణించాడంటూ చంద్రయ్య బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. అవాంఛనీయమైన సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడి చంద్రయ్యకు భార్య కనకలక్ష్మి, కుమారులు మహేష్, మనోహర్ ఉన్నారు.



ఆసుపత్రి ఎదుట రోదిస్తున్న బంధువులు, (ఇన్‌సెట్లో)చంద్రయ్య(ఫైల్)

శ్రీనివాస్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు

- దుబాయ్ మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో దారుణంగా హత్యకు గురైన స్వర్గం శ్రీనివాస్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దమ్మన్నపేటగ్రామానికి చెందిన స్వర్గంశ్రీనివాస్‌ని దుబాయ్‌లో ఓ పాకిస్తానీ దారుణంగా నరికిచంపాడు. మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో మృతుడి భార్య స్వర్గం జమున, కొడుకులు స్వర్గం చందు, సూర్యతోపాటు తల్లి స్వర్గం రాజవ్వను బుధవారం వారు పరామర్శించారు. అనంతరం మృతి వివరాలు అడిగి తెలుసుకుని తల్లి రాజవ్వకు వ్యక్తిగతంగా ప్రభుత్వవిప్ లక్ష్మణ్‌కుమార్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ద్వారా ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి శ్రీనివాస్ మృతదేహాన్ని వీలైనంత త్వరలో స్వదేశానికి తీసుకువచ్చే విధంగా కృషిచేస్తామని తెలిపారు. ప్రభుత్వం మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. మృతుని కొడుకు డిగ్రీ చదివి ఉన్నాడని, అవుట్ సోర్సింగ్ జాబ్‌తోపాటు ఇందిరమ్మఇళ్లు, ఎన్ఆర్ఐపాలసీ కింద ప్రభుత్వం తరఫున రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించే విధంగా చూస్తామని అన్నారు. శ్రీనివాస్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. వారివెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండలకాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లాకాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణకాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, మాజీ ఎంపీటీసీ తోడేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జేఎన్‌టీయూలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలు

రామగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రహైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యుడిషియల్ మినిస్టీరియల్‌అండ్‌సబార్డినేట్ సర్వీసెస్ ఆన్‌లైన్ పరీక్ష బుధవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. జూనియర్ అసిస్టెంట్‌పోస్టులకు జరిగిన పరీక్షలో ఉదయం వందమందికి 67మంది, సాయంత్రం56మంది హాజరు కాగా 44మంది హాజరుకాలేదు.. ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రకుమార్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అభ్యర్థుల హాల్‌టికెట్‌లను చూస్తున్న సిబ్బంది

పెంపకానికి ఆరు రోజుల శిశువు

- జయశంకర్ జిల్లా వాసికి ఇచ్చిన మహారాష్ట్ర దంపతులు
- శిశువుకు అనారోగ్యంతో గోదావరిఖని ఆసుపత్రికి
- అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చిన ఆసుపత్రి వర్గాలు
- శిశువు సంరక్షణ చేపట్టిన ఐసీపీఎస్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన దంపతులు తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లావాసికి ఆరు రోజుల శిశువును పెంపకానికి ఇవ్వడంపై దుమారం నెలకొన్నది. శిశువు అనారోగ్యంతో ఉండడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మంగళవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు తీసుకువచ్చారు. శిశువు వివరాలు పొంతన లేకుండా చెప్పడంతో అనుమానం వచ్చిన ఆసుపత్రి సిబ్బంది పోలీస్ అవుట్ పోస్టుకు సమాచారం ఇచ్చారు. దీంతో గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ ఇంద్ర ఇంద్రసేనారెడ్డిలు విచారణ చేయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

మహారాష్ట్ర బల్లార్షకు చెందిన దుర్గం, రవీంద్ర దంపతులు బ్రెడ్ కంపెనీలో కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇప్పటికే వీరికి ముగ్గురు సంతానం. నాలుగవ సంతానం కలుగడంతో పెంపకానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం చెందిన చాంద్‌పాషా తనకు పెంపకానికి శిశువు కావాలని మంచిర్యాలకు చెందిన మ్యారేజీ బ్యూరో నిర్వాహకురాలిని సంప్రదించాడు. ఆమె మహారాష్ట్రలో బ్రెడ్ కంపెనీలో పని చేసే శంకర్ అనేవ్యక్తి ద్వారా దుర్గం, రవీంద్రలను సంప్రదించింది. వారు తమ శిశువును పెంపకానికి ఇచ్చేందుకు అంగీకరించారు. మంగళవారం బల్లార్షా నుంచి శిశువును మంచిర్యాలకు తీసుకువచ్చి జయ, కాటారం చెందిన చాంద్‌పాషాలకు అప్పగించారు. శిశువును కాటారంకు తీసుకెళుతుండగా కదలికలు లేకపోవడంతో మంగళవారం రాత్రి గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో బుధవారం పోలీసులు మహారాష్ట్ర నుంచి బ్రెడ్ కంపెనీ నిర్వాహకులు, శిశువు తల్లిదండ్రులతోపాటు మంచిర్యాలకు చెందిన జయ, కాటారానికి చెందిన చాంద్‌పాషాలను విచారించారు.

చట్ట విరుద్ధంగా పెంపకానికి తీసుకువచ్చినట్టు గుర్తించారు. పెంపకానికి ఇచ్చిన విషయంలో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరుగలేదని ఇరుపక్షాలు పేర్కొన్నాయి. శిశువు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. శిశువును పెద్దపల్లి జిల్లా మిషన్ వాత్సల్య(సమగ్ర బాలల పరిరక్షణ పథకం) అధికారుల పర్యవేక్షణకు అప్పగించారు. ప్రస్తుతం శిశువు వారి తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉంది.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువు

ఉమ్మడి కరీంనగర్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

కేంద్ర మంత్రులకు బండి సంజయ్ వినతి



కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్ గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసిన బండిసంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, గజేంద్రసింగ్ షేకావత్‌లకు ఢిల్లీలో బుధవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యే సాయం (ఎస్ఎఎస్‌సిఐ) పథకం కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన గజేంద్ర సింగ్ షేకావత్ ఈ విషయంపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. సిరిసిల్ల లేదా సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కేంద్రం సైనిక్ స్కూల్ మంజూరు చేస్తే భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సిరిసిల్ల, హుస్నాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు.

కార్మికచట్టాలు, హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

లేబర్ కోడ్‌ల రద్దుకోసం కార్మికులు పోరాటానికి సన్నద్ధం కావాలి

మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కార్మిక చట్టాలతోపాటు వారి హక్కులను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని, కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్‌లను రద్దుచేయాలంటూ కార్మికులు పోరాటానికి సన్నద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో బుధవారం సీఐటీయూ అనుబంధ రంగాలు, యూనియన్‌ల ముఖ్య నాయకులతో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. బడా పెట్టుబడి దారులకు, కార్పొరేట్లకు కొమ్ముకాసే విధంగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక చట్టాలు, హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్‌ల రద్దుకు దేశంలోని అన్ని జాతీయ,ప్రాంతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మే 20న చేపట్టే సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కోటం రాజు, జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూషం రమేష్, గుర్రం అశోక్, అన్నల్‌దాస్ గణేష్, గురజాల శ్రీధర్, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, గీస బిక్షపతి, మల్యాల నర్సయ్య, సిరిమల్ల సత్యం, జిందం కమలాకర్, రమేష్‌చంద్ర, భారతి, లక్ష్మీ, శ్రీనివాస్, రవి, సురేష్, శేఖర్, రాజు, రమేష్ శ్రీధర్, నర్సయ్య, రాజెల్లయ్య, కుమార్, దేవరాజు, బాబాకిషన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

మామిడి రైతుకు మార్కెట్ కష్టాలు



- జగిత్యాలలో ప్రారంభమైన కొనుగోళ్లు
- కమీషన్ ఏజెంట్ల సిండికేట్‌తో నష్టాలు
- నామమాత్రంగా మారిన ఓపెన్ మార్కెట్
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మామిడికి ప్రసిద్ధి గాంచిన జగిత్యాలలో రైతులకు మార్కెటింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. జిల్లాలో మామిడి సాగు అధికంగా ఉన్నప్పటికీ మద్దతు ధర సౌకర్యం లేకపోవడంతో రైతులు ప్రైవేటులో విక్రయించక తప్పడం లేదు. ఈ క్రమంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి మామిడి ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. దీంతో మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, ఇతర ప్రాంతాలతో పోలిస్తే జగిత్యాల మార్కెట్‌లో మామిడికి సరియైన ధర రావడం లేదు. అందుబాటులో ఉన్న ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకే రైతులు పంటను అమ్ముకుంటున్నారు.



మామిడిని ప్యాక్ చేస్తున్న కార్మికులు

కోట్లలో వ్యాపారం

జగిత్యాల మామిడి మార్కెట్ 23 ఎకరాల్లో 2005లో ఏర్పాటు కాగా ప్రతీ సంవత్సరం సుమారు రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందన్న అంచనా ఉంది. చల్‌గల్ సమీపంలోని వాలంతరీ స్థలాన్ని మార్కెట్‌కు కేటాయించారు. రూ.10 కోట్లతో వ్యాపారులకు షెడ్లు నిర్మించారు. మామిడి కాయల కొనుగోలుకు సుమారు 90 మంది కమీషన్ ఏజెంట్లు, 59 మంది అడ్తిదారులు ఉన్నారు. వీరికి తోడు ఢిల్లీకి చెందిన పలువురు హోల్‌సెల్ వ్యాపారులు జగిత్యాలలో సీజన్ సమయంలో లాడ్జీల్లో తిష్టవేసి కమీషన్ ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేసి పలు ప్రాంతాలకు పెద్దఎత్తున తరలిస్తుంటారు. సీజన్‌లో ఇక్కడి నుంచి మామిడి కాయలను పంజాబ్, హర్యానా, ఢిల్లీ, నాగ్‌పూర్, ముంబై వంటి ప్రాంతాలకు రోజూ కనీసం 5 నుంచి 10 లారీల్లో టన్నుల కొద్దీ తరలిస్తుంటారు.

నామమాత్రంగానే ఓపెన్ మార్కెట్

జగిత్యాల మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు చెప్పిందే ధర అన్నట్టుగా తయారైంది. ఓపెన్ మార్కెట్ నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నా అది నామమాత్రమే అన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు కమీషన్ ఏజెంట్లు మినహా ఓపెన్ మార్కెట్‌లో యాక్షన్‌లో ఎవరూ వ్యాపారులు గాని, అడ్తిదారులు గాని, కమీషన్ ఏజెంట్లు గాని భాగస్వామ్యం కావడం లేదు. ఓపెన్ మార్కెట్ అయితే రైతులు తొలుత ఏ వ్యాపారిని సంప్రదించాల్సిన అవసరం లేదు. మామిడి కాయలను తెంపుకొని మార్కెట్‌కు వచ్చి, కాంటా వేసుకొని కుప్పలు పోస్తే లైసెన్స్ పొందిన కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు వచ్చి మార్కెట్ అధికారుల సమక్షంలో కాయ నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తారు. అప్పుడు వ్యాపారుల్లో పోటీ పెరిగి రేటు ఎక్కువ వచ్చే అవకాశాలుంటాయి. ఓపెన్ యాక్షన్‌లో ఢిల్లీ వంటి ఇతర రాష్ట్రాల వ్యాపారులు సైతం పాల్గొంటే రైతులకు మరింత ధర వస్తుంది.



లారీల్లో లోడ్

జిల్లాలో సాగు ఇలా..

ఉమ్మడి జిల్లాలో సుమారు 75 వేల ఎకరాల్లో మామిడి సాగు అవుతుండగా జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో మామిడి తోటలున్నాయి. స్థానిక రకాలతో పాటు బంగినపల్లి, దశేరి, హిమాయత్, చిన్న రసాలు, పెద్ద రసాలు, తోతాపురి తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. జగిత్యాల మామిడికి ప్రత్యేక గుర్తింపు ఉండడంతో ఇక్కడి పండ్లకు ఢిల్లీ, పుణే, ముంబై, నాగ్‌పూర్ తదితర ప్రాంతాల్లో సైతం గిరాకీ ఉంటుంది. సారవంతమైన ఎర్ర గరప నేలలు, మామిడి కాపు సమయంలో అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం, గాలిలో తేమ శాతం అతి తక్కువగా ఉండడం, నేలల్లో పొటాష్ తదితర పోషకాలు సమృద్ధిగా ఉండడం, సాగునీటి వసతి, చీడపీడల తీవ్రత తక్కువగా ఉండడం తదితర కారణాలతో జగిత్యాల మామిడికి రుచి, నాణ్యత రీత్యా విపరీతమైన డిమాండ్ ఉంది.

ఢిల్లీ వ్యాపారులతో కుమ్మక్కు

కొన్నేళ్ల క్రితం వరకు జగిత్యాల రైతులు మామిడి పంట అమ్ముకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు. 2005లో జగిత్యాలలో మార్కెట్ ఏర్పాటు చేసిన తర్వాత జిల్లా నుంచే కాకుండా నూతనంగా ఏర్పడిన 10 జిల్లాల నుంచి ఈ మార్కెట్‌కు రైతులు మామిడి కాయలను తీసుకువస్తున్నారు. ప్రతీ యేడాది దాదాపు 60 నుంచి 70 టన్నుల మామిడి కాయలు వస్తుంటాయి. జగిత్యాలలో ప్రైవేటు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు కొంత మేర ఉపశమనం లభించింది. అయితే స్థానిక వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కూడా ఢిల్లీ వ్యాపారులతో కుమ్మక్కై ధరలు అమాంతం తగ్గించేస్తున్నారు. ప్రతీ సంవత్సరం సీజన్ ప్రారంభంలో కొన్ని రోజులు అధిక ధరలు పెట్టి ఆ తర్వాత ధరలను తగ్గించేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను పరిష్కారాన్ని మార్కెటింగ్ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ప్రస్తుత సీజన్‌కు ముందు కిలోకు రూ.100కు పైగా ఉన్న ధరలు, సీజన్ ఆరంభ సమయంలో రూ.70 నుంచి రూ. 80 వరకు పలికాయి. ప్రస్తుత కిలో రూ.35 నుంచి రూ.40 వరకు మంచి రకం మామిడి, రూ.20 నుంచి రూ.30 వరకు ఇతర రకం మామిడికి ధరలు పలుకుతున్నాయి. హైదరాబాద్ గడ్డి అన్నారం, ఢిల్లీ, కరీంనగర్ మార్కెట్‌లతో పోలిస్తే జగిత్యాల మార్కెట్‌లో క్వింటాలుకు రూ.1000 నుంచి రూ.200వ వరకు ధరలు తక్కువగా పలుకుతు న్నాయని రైతులు అంటున్నారు.

కమీషన్ పద్ధతిలోనే అధిక కొనుగోళ్లు

జగిత్యాల మార్కెట్‌లో ఓపెన్ యాక్షన్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని అధికారులు, వ్యాపారులు అంటున్నప్పటికీ అధిక కొనుగోళ్లు కమీషన్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. మామిడి కాయల కొనుగోలుకు లైసెన్స్ తీసుకున్న కమీషన్ ఏజెంట్లు మార్కెట్‌లోని షెడ్డుల్లో కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. రైతులు తాము పండించిన మామిడి కాయల రకాలను తెచ్చి వ్యాపారులకు చూపిస్తే వారు ధర నిర్ణయిస్తున్నారు. కాయలు, రేటు నచ్చితే అక్కడే తూకం వేయిస్తారు. ఈ పద్ధతిలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వ్యాపారులు ఇష్టారీతిన ధర నిర్ణయిస్తుండడంతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. తొలుత శాంపిల్ తెచ్చి కాయలకు ఓ రేటు చెప్పి..తీరా మార్కెట్‌కు తెచ్చి తర్వాత కాయ బాగలేదంటూ రేటు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు క్యాష్ కటింగ్, కమీషన్ కటింగ్ అంటూ వ్యాపారులు దోచుకుంటున్నారని రైతులు అంటున్నారు.

పత్తాలేని మార్కెటింగ్ శాఖ

జగిత్యాల మామిడి మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులు మచ్చుకు కూడా కనిపించడం లేదు. చీకటి సమయంలో జరిగే ఈ మార్కెట్‌కు అధి కారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. అది కూడా కింది స్థాయి సిబ్బంది మినహా అధికారులు ఎవరూ రావడం లేదని రైతులు వాపోతున్నారు. జగిత్యాలలో మామిడి మార్కె ట్ సుమారు రాత్రి 8 గంటల సమయంలో ప్రారంభమై అర్ధరాత్రి వరకు కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం మార్కె టింగ్‌శాఖ ఉద్యోగుల సమక్షంలో ఓపెన్ మార్కెట్‌లో మామిడి యాక్షన్ జరగాల్సి ఉంటుంది. ఏ రైతు..ఎంత మామిడి సరుకు తీసుకువస్తున్నారు... ఏ కమీషన్ ఏజెంట్లు ఓపెన్ మార్కెట్‌లో అధిక ధర పలికి ఎంత సరుకు కొనుగోలు చేస్తున్నాడు.. రైతులకు రశీదులు... నగదు సరిగా ఇస్తున్నారా.. లేదా అని పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. మార్కెట్‌లో కాంటా వేయడానికి వసతి లేకపోవ డంతో రైతులు ప్రైవేటు కాంటాలను ఆశ్రయిస్తున్నారు. మార్కెట్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ధర్మకాంట వద్ద తూకం వేస్తున్నారు. దీనికి గతంలో రూ.40 నుంచి రూ.50 వసూలు చేయగా ప్రస్తుత సీజన్‌లో రూ.80 వరకు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

జవ్వాజి గంగాధర్, మామిడి రైతు, తిమ్మాపూర్



జగిత్యాల మార్కెట్‌లో మామిడి కొనుగోలు ఓపెన్ యాక్షన్ ద్వారా నామమాత్రంగానే జరుగుతున్నాయి. మార్కెట్ మొత్తంలో సుమారు 90 మంది వరకు కమీషన్ ఏజెంట్లు ఉండగా ఒకరిద్దరు మాత్రమే ఓపెన్ యాక్షన్‌లో భాగస్వామ్యం అవుతున్నారు. ఓపెన్ యాక్షన్‌ను పర్యవేక్షిం చాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కువగా మామిడి కొను గోళ్లు కమీషన్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. క్యాష్ కటింగ్, కమీషన్ కటింగ్ పేరుతో సుమారు 20 శాతం వరకు కోతలు పెడుతున్నారు. నాణ్యత గల మామిడిని మార్కెట్‌కు తీసుకు వచ్చినప్పటికీ ధరలు సరిగా రావడం లేదు.

ఫిర్యాదులు వస్తే విచారణ చేపడతాం

ప్రకాశ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి, జగిత్యాల



చల్‌గల్ మామిడి మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఓపెన్ యాక్షన్ ద్వారా అమ్మకాలు జరపాల్సి ఉంటుంది. వ్యాపారులు సిండికేట్ కావడం, ధరలు తగ్గించడం వంటివి జరపకూడదు. మార్కెట్‌లో రైతులకు అవసరమైన వసతులను సమకూర్చాం. రాష్ట్రంలోని హైద్రాబాద్ గడ్డి అన్నారం, కరీంనగర్ వంటి మార్కెట్లలో ఉన్న మామిడి ధరల పట్టికను ప్రతి రోజు జగిత్యాల యార్డులో ప్రదర్శిస్తున్నాం. రైతులు మామిడి విక్రయించిన తర్వాత కమీషన్ ఏజెంట్, వ్యాపారి వద్ద నుంచి రశీదును తీసుకోవాలి.

సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని సరిచూసుకోవాలి



రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి

వేములవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు సరిచూసుకొని వార్తలు రాయాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలో నిర్మించిన ప్రెస్ క్లబ్ అదనపు సమావేశ మందిరాన్ని స్థానిక శాసన సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు నిజాలను వెలికి తీసే వార్తలు రాయాలని, ప్రెస్ క్లబ్‌లు జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంచే కేంద్రాలుగా, ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికలుగా మారాలన్నారు. ప్రస్తుతం కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా పెరిగిందని, 30 ఏళ్లుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మెయిన్ స్ట్రీమ్ మీడియా మొదలుకొని నేడు సోషల్ మీడియా విప్లవం వరకు వచ్చిందని, అయినప్పటికీ సోషల్ మీడియాను వ్యతిరేకించాల్సిన పనిలేదన్నారు.

మెయిన్ స్ట్రీమ్ మీడియాకు జబ్బులు అంటుకున్న విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారని, సమాచార వ్యవస్థ ప్రజలకు సరైన సమాచారాన్ని, వాస్తవాలను అందించాలని కోరారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో నీతి, నియమాలకు అనుగుణంగా పనిచేసే వ్యవస్థ ఉంటుందని, వృత్తి అనుభవం ఉన్న వారు గేటు కీపర్ వ్యవస్థ ఉందని, కానీ సోషల్ మీడియాకు గేట్ కీపర్ వ్యవస్థ లేదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏఐతో చేసిన చిత్రాలను చూసి జనాలు చలించిపోయారని, ఏఐ నుంచి ప్రజలను రక్షించడం ఒక ఎత్తని, జర్నలిస్టులుగా వాస్తవాలను తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ఫార్వర్డ్ చేస్తున్నామని, అలా అయితే కేసులు తప్పవని, ఏఐతో జర్నలిస్టులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వర్కింగ్ జర్నలిస్టుల నైపుణ్యాన్ని పెంచడానికి ప్రెస్ క్లబ్‌లు కృషి చేయాలనీ, సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ఫ్యాక్ట్ చెక్ ఎలా చేయాలో నేర్పించేందుకు ప్రెస్ అకాడమీ సిద్ధంగా ఉందని, అవసరమైతే ఫాక్ట్ చెక్ కోసం వేములవాడలో రెండు రోజుల పాటు ట్రైనింగ్ ఇవ్వడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు జర్నలిస్టులు

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు అని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ అదనపు సమావేశ మందిరం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు మంజూరు అయ్యేలాగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాంబోజ ముత్యం, వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి విద్యారణ్యపురి కాలనీలో ఆర్థిక ఇబ్బందులతో ఎలుకోరు సురేందర్ రెడ్డి(45) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సురేందర్‌రెడ్డి కరీంనగర్ సెవెన్‌హిల్స్ ప్రాంతంలో వాటర్ ప్యూరిఫై షాపును నిర్వహిస్తున్నాడు. భార్య మంథని జేఎన్‌టీయూలో ఉద్యోగం చేస్తోంది.

ఉదయం భార్యను మంచిర్యాల బస్టాప్, చిన్న కూతురును స్కూల్‌లో వదిలిపెట్టిన సురేందర్‌రెడ్డి ఇంటికి చేరుకున్నాడు. కూతురు మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి సురేందర్‌రెడ్డి ఉరికి వేళాడుతూ కనిపించాడు. జేబులో ఒక సూసైడ్ నోట్ లభించింది. వ్యాపారంలో నష్టం, అప్పుల బాధతో బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని చేనేత కార్మికుడు..

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతోపాటు మానసిక సమస్యలతో బాధపడుతున్న కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీ నగర్‌కు చెందిన ఉడుత సుధాకర్ ఉరేసు కొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసగా మారిన సుధాకర్‌కు మానసిక వైద్యుడి వద్ద చికిత్స అందిస్తున్నారు. మంగళవారం ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో పవర్‌లూమ్స్ షెడ్‌లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదు

● బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదు ● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదని, దీనివల్లే బోర్డుకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ వరంగల్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పసుపు బోర్డు తెచ్చామని చెబుతున్న బీజేపీ, కేవలం గెజిట్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పసుపు ధరలు పడిపోతే బోర్డు నుంచి రైతులకు డబ్బులు ఇస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చెప్పారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ఆమె ప్రశ్నించారు. బీజేపీ ప్రకటించిన విధంగా రెండు కోట్ల ఉద్యోగాలు, పసుపు బోర్డుకు చట్టబద్ధత గురించి తాము అడిగితే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు.

రాష్ట్రం నుంచి 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కనీసం ఎనిమిది రూపాయలు కూడా ఇవ్వలేదని ఆమె ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాయమాటలను బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కవిత పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవం గులాబీ పండగ మాత్రమే కాదని, తెలంగాణ పండగ అని చెప్పుకొచ్చారు. కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా 50 శాతం మం దికి ఇప్పటికీ రాలేదన్నారు. ఫ్రీబస్ ఇస్తే బస్సులు పెంచాలా లేదా అని ఆమె ప్రశ్నించారు. తెలంగాణను కాపాడేది కేవలం బీఆర్ఎస్ మాత్ర మేనని కవిత స్పష్టం చేశారు.

జగిత్యాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడో అర్థం కావడం లేదు..

గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నడో ప్రజలకు అర్థం కావడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆయన ప్రస్తుతం బీఆర్ఎస్ లోనైతే లేడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఒకసారి, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో ఢిల్లీలో మరోసారి వార్తల్లో కనిపిస్తు న్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ చేయి పట్టి నడిపిస్తే సంజయ్ ఎమ్మెల్యే అయ్యాడన్నారు.

ఇటీవల జరిగిన ఓ సర్వేలో జగిత్యాల ఎమ్మెల్యేకు 108వ ర్యాంకు వచ్చిందన్నారు. రోళ్లవాగు ప్రాజెక్టు కడితే 18 నెలల్లో కనీసం గేటు పెట్టలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు క్యాడర్‌ను ఆహ్వానిస్తూ జగిత్యాల తెలంగాణ చౌరస్తాలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాల్ రైటింగ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, రాజేశంగౌడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తదితరులు ప్రసంగించారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, వేములవాడ, చొప్పదండి తదితర నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

●సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్ : నగరంలోని ఆలయాల్లో బుధవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు భక్తుల పూజల కోసం ఏర్పాట్లు చేశారు.

కరీంనగర్ కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు భగత్‌నగర్ భగవతి హైస్కూల్‌లో కథా రచయిత కటకోజ్వల మనోహరాచారి రచించిన 'వారధి' కథా సంకలనం ఆవిష్కరించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలోని గ్రీన్ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో కరీంనగర్ అగ్ని మాపక అధికారి రాజుకుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ అంగన్ వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల పిల్లలకు హెల్త్ చెకప్ చేయించారు. మండల వైద్యాధికారి హరీష్ అవగాహన కల్పించారు.

భగత్‌నగర్: పోషణ్ పక్వాడ్‌లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆసిఫ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ మేళ నిర్వహించారు.

భగత్‌నగర్: కొత్తపల్లి పట్టణంలోని రెడ్డి రామయ్య పల్లెలో అడిగొప్పుల సువర్ణ మురళి చేనేత కార్మికుని ఇంట్లో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పొన్నం సత్యనారాయణగౌడ్ బుధవారం సన్న బియ్యం భోజనం చేశారు. కొత్తపల్లి పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, చిలుక హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల రవీందర్‌ను ఎన్నుకున్నారు. తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గణేశ్‌నగర్: విద్యుత్ లైన్లలో సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ 1 బీఅశోక్ అన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో బుధవారం డీఈలు, ఏడీఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు.

‘ఉపాధి’ కల్పనలో రెండోస్థానం

- సత్ఫలితాలిస్తున్న ఉపాధిహామీ పథకం - లక్ష్యాన్ని మించిన పనిదినాలు


ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించడంలో కరీంనగర్ మండలం రెండోస్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 466 కుటుంబాలు 100 రోజుల పని పూర్తి చేశాయి. ఒక్కో కూలీకి ఒక రోజు కూలి సగటున 250 రూపాయలు చెల్లించారు. కరీంనగర్ మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 134 పనులకు 1,51,000 పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్ణయించారు. గ్రామాల్లో నర్సరీలు, ప్లాంటేషన్ల ఏర్పాటు, రైతులకు మట్టి రోడ్ల నిర్మాణం, నీటి కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పాలన జాతర పేరిట పలు ఉపాధిహామీ పనుల్లో మిగిలిన పనులు, పనిదినాలను పూర్తి చేసేందుకు గ్రామాల్లో పనులను గుర్తించి పూర్తి చేయించింది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 86 యూనిట్లు మంజూరవగా పశువుల షెడ్లు 57 యూనిట్లకు 27, కోళ్ల ఫారం 6 యూనిట్లకు 3, కంపోస్టు 13 యూనిట్లకు 9, అజోల 13యూనిట్లకు 3 పూర్తయ్యాయి. మిగతా ఇంకుడు గుంతలు 15, హార్టికల్చరల్ 5 ఎకరాలు, రూట్‌టాప్ 1, నర్సరీలు 14 పూర్తయ్యాయి. మార్చి ఆఖరు వరకు లక్ష్యాన్ని మించి 1,80,502 పనిదినాలు పూర్తి చేసి 466 కుటుంబాలు వంద రోజులు పని చేయడంతో కరీంనగర్ మండలం జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈనెల 1నుంచి కొత్త ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభమయ్యాయి. రోజు కూలీ రూ.307పెరగడంతో కూలీలు ఎక్కువగా వస్తున్నారు.

కరీంనగర్‌లో నూతన విద్యకు శ్రీకారం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో విద్యకు కొత్త దిశను పరిచయం చేయనున్నట్లు బన్సల్ క్లాసెస్ జూనియర్ కాలేజీల చైర్మన్, ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ అన్నారు. బుధవారం నగరంలోని రేకుర్తిలో బన్సల్‌క్లాసెస్ క్యాంపస్‌లో విలేకరులతో మాట్లాడారు. మే 28వ తేదీ నుంచి బన్సల్‌క్లాసెస్ ప్రారంభించనున్నట్లు, విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంపొందించే విధంగా 45 ప్రశ్నల ద్వారా సబ్జెక్ట్ వారీగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. టెక్స్ట్ బుక్స్‌పై ఆధారపడని ప్రయోగాత్మక అధ్యయన విధానాన్ని బన్సల్ క్లాసెస్‌లో ప్రవేశ పెడుతున్నామన్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్‌లో ప్రత్యేక ప్రోగ్రాంలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఆర్మీ, నేవీలో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులకు ఉద్యోగాలు


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ కొత్త సతీష్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ జీడీ క్లర్క్, టెక్నికల్ విభాగం, నేవీ ఎస్ఎస్ఆర్ ఫలితాల్లో నగరంలోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో 129 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. బుధవారం అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ కొత్త సతీష్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు డిఫెన్స్ ఉద్యోగాలపై శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు సాధించే విధంగా తయారు చేస్తున్నామన్నారు. విద్యార్థులు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించారన్నారు. డిఫెన్స్ రంగంలో ఉద్యోగాలు సాధించడంలో వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి ఉందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బాలికలకు కూడా క్యాంపస్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విదుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, రూరల్, ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, గాదం రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 వరకు డీమార్ట్, వరలక్ష్మీ గార్డెన్, తులసీనగర్, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్, రెడ్డి ఫంక్షనల్ బ్యాక్ సైడ్, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు కమాన్‌పూర్, గ్రానైట్ పరిశ్రమల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చదువుతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ప్రముఖ రచయిత, కాలమిస్టు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం వాణినికేతన్ డిగ్రీ పీజీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ-వ్యక్తిత్వ వికాస బోధన ప్రారంభోత్సవంలో మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాకార దిశగా ముందడుగు వేయాలన్నారు. కళాశాల డైరెక్టర్ జి.వేణు గోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ డి.వేణుగోపాల్ రెడ్డి సంస్థ చైర్మన్ దీపిక పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఆదర్శం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాల ఆధ్వర్యంలో సామాజిక సేవలో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నట్లు వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ బీవీఆర్ గోపాల్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో డైమండ్స్ ఆఫ్ వాగేశ్వరి యూ డిడ్ ఇట్ అవార్డు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే అడ్మిషన్లలో టాప్ 10 కళాశాలలో తమ కళాశాల టాప్ 3లో ఉండడం గర్వకారణమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌లు సతీష్‌గౌడ్, లింగమూర్తి, వెంకట్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, రమణ, ప్రసాద్, యువ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి


సీపీకి పూలమొక్క అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషనరేట్ కార్యాలయంలో సీపీని కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీని సన్మానించారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన శ్లోక, అబ్దుల్ అర్హాన్, జి.సాయి సంహిత్, శివేన్‌రెడ్డి, స్నిగ్ధశ్రీ, వాన్మయి, కె.సాన్వి, ర్యాంకులు సాధించారన్నారు.

మానేరులో బహుమతుల ప్రదానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో 2024-25 విద్యాసంవత్సరానికి నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బుధవారం విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి బహుమతులను అందజేశారు. విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, ప్రిన్సిపాల్ రాజు చాకో, సరితారెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

జాతీయ కరాటేలో అద్విత విద్యార్థికి గోల్డ్ మెడల్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో కేడెట్ కటా విభాగంలో అద్విత పాఠశాలకు చెందిన 2వ తరగతి విద్యార్థి ఎన్.హిమాన్ష్ గోల్డ్ మెడల్, బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు సాధించాడు. ఈ సందర్భంగా హిమాన్ష్‌ను పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సొగాని, ప్రిన్సిపాల్ మాధురి శ్వేత అభినందించారు.

టైపిస్టు, స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఉద్యోగాల భర్తీలో టైపిస్టు, స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ రికగ్నైస్డ్ టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలిగ సతీష్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా టైపిస్టు, స్టెనోగ్రాఫర్ ఉద్యోగాల భర్తీలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అదనపు అర్హతగా చేర్చి నియామకాలు చేపట్టాలన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు మంత్రి పరామర్శ


దుర్గారెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్సపొంది ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ పీఏసీఎస్ చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం పరామర్శించారు. మంకమ్మతోటలోని దుర్గారెడ్డి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

సాధనా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సాధనా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్‌లో బుధవారం యూకేజీ, 5వతరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, హై స్కూల్ ప్రిన్సిపాల్ కుమారస్వామి ప్రైమరీ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి విద్యార్థులను అభినందించారు.

అద్దె బకాయిలు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థుల ఐదు నెలల మెస్ చార్జీలు, భవనాల అద్దె బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బకాయిలు చెల్లించకపోవడంతో అద్దె భవన యజమానులు సంక్షేమ హాస్టళ్లను ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు.

గాంధీ కుటుంబంపై బీజేపీ రాజకీయ ప్రతీకార చర్యలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబంపై బీజేపీ రాజకీయ ప్రతీకార చర్యలకు పాల్పడుతోందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో ఈడీ చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ గాంధీ పేర్లు నమోదు చేసి బీజేపీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించిందంటూ బుధవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని ఆదాయపన్నుశాఖ (ఐటీ) కార్యాలయం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి కాంగ్రెస్‌పై దాడులు కొనసాగుతున్నాయన్నారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, అర్బన్‌బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ మండలానికి చొక్కారావు పేరు పెట్టాలి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చామనపల్లికి చెందిన చొక్కారావు పేరును కరీంనగర్ మండలానికి నామకరణం చేయాలని, ఆయన చరిత్రను ప్రజలకు తెలపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కోరారు. బుధవారం సీపీఐ కరీంనగర్ మండల 8వ మహాసభ మండల కార్యదర్శి సాయవేని రాయమల్లు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరీంనగర్ మండలమే కాకుండా జిల్లాలోని బలహీన వర్గాలు, భూమి లేని నిరుపేదల కోసం ఉద్యమించిన మహోన్నత వ్యక్తి చొక్కారావు అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


ఇల్లందకుంట: మల్యాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని మల్యాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులవద్ద కొనుగోలు చేసిన సన్న ధాన్యానికి బోనస్‌డబ్బులు చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, పోడేటి రామస్వామి, సింగిల్‌విండోచైర్మన్ తిరుపతిరెడ్డి, వెంకటేష్,వీరస్వామి పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంతోపాటు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతుధరకు ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సంఘంసభ్యులు శంకర్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అనసూర్య, సుజాత, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి: ఎమ్మెల్యే సత్యం


గంగాధరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర/రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలుకేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు పొందాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర, రామడుగు మండలాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చివరి గింజవరకు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి కటింగ్ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశరాజ్‌పల్లి, కొక్కెరకుంట గ్రామ శివారులో డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌చేసి సమస్య పరిష్కరించాలని తెలుపగా, స్థలాన్ని పర్యవేక్షించి చెత్త, వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. గంగాధరలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజిత, కురిక్యాల, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, బాలగౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కరుణాకర్, ఏపీఎం పవన్, ఎంపీడీవో రాము, రామడుగులో సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మన్ జవ్వాజి హరీష్, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, వైస్ చైర్మన్ పిండి సత్యం, బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

మానకొండూర్/చొప్పదండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నేటినుంచి మే11 వరకు పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండలపశు వైద్యాధికారులు సుస్మితారెడ్డి, అరవింద్‌రెడ్డి తెలిపారు. చొప్పదండిలో మే17వరకు నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి శశికాంత్‌రెడ్డి తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు లేక రైతుల ఇబ్బందులు

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటికీ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతశనివారం కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం మండల కేంద్రంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ మిల్లర్ల నుంచి కొనుగోలు చేయుటకు ఎలాంటి అనుమతి రాకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

చొప్పదండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు చొప్పదండిలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది స్మారకార్థం దేశవ్యాప్తంగా ఏప్రిల్ 14నుంచి 20వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుండగా పట్టణంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాంలలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కిషన్, సందీప్, మనోహర్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు అందజేత

మానకొండూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగురుపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం గ్రామానికి చెందిన ముద్దసాని శ్రీరామ్‌రెడ్డి ఉచితంగా ఫ్యాన్లు కొని అందజేశారు. చిన్న పిల్లలు వేసవి ఉక్కపోతను తట్టుకోవడం లేదని తన దృష్టికి రావడంతో రెండు కేంద్రాలకు ఫ్యాన్లను అందజేశానన్నారు.

నేడు గన్నేరువరంలో భూభారతిపై రైతులకు అవగాహన

గన్నేరువరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రెవెన్యూ చట్టం భూభారతిపై రైతులకు గురువారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరుకానున్నట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కావద్దు: సీఐ

చొప్పదండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్, గంజాయికి బానిసకావద్దని సీఐ ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్, గంజాయిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ గేమింగ్, గంజాయితో అనేక అనర్థాలు జరుగుతాయని తెలిపారు. ఎస్సై సురేందర్ పాల్గొన్నారు.

గంగాధర: డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఎస్ఐ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే బాలురగురుకుల పాఠశాలలో విద్యా ర్థులకు సైబర్‌నేరాలు, మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులుఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే 1930కాల్ చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే ఆయిల్ పాం తోటలను పరిశీలించిన ప్రపంచ సంస్థ బృందం

భగత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆయిల్ పామ్ తోటలను ప్రపంచ స్థాయి ఆయిల్‌పామ్ విత్తనాల్లో ప్రథమ స్థానంలో ఉన్న పామ్ ఎలైట్ సంస్థ సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక విత్తన సరాఫరా దారు నేరుగా రైతులకు సహకారం అందించి సాంకేతిక మద్దతు ఇవ్వడం చాలా అరుదు అన్నారు. ఫ్రాన్స్, ఇండోనేషియా బృందం సభ్యులు నికోలస్ టర్న్‌బుల్, అంబ్రే ఫాబింగ్, శ్రీవిజియన్, టెక్నికల్ అడ్వైజర్ లోహియా, శ్రీరంగ నాయకులు, డీహెచ్‌ఎస్‌వో శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలి

శంకరపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలని శంకరపట్నం జర్నలిస్టుయూనియన్ నాయకులు బుధవారం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ మండలకేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవనం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్రముఖ రచయిత పత్రిక సంపాదకుడు పత్రికారంగానికి సేవలందించిన సురవరం ప్రతాప్‌రెడ్డి విగ్రహాన్ని శంకరపట్నంలో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు కోరెం శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు గోపు శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారుడు కొరిమి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేష్, జర్నలిస్టుల దాడుల వ్యతిరేక కమిటీ కన్వీనర్ దేవునూరి రవీందర్, ఉపాధ్యక్షుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రాక్ సూట్ల పంపిణీ

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల పరిధిలోని గుడి వెలుగులపల్లి పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు ఎంఈవో అంబటి వేణుకుమార్ ట్రాక్ సూట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు వెలిచాల పీహెచ్‌సీ డాక్టర్ అశ్విని హెల్త్ క్యాంపును నిర్వహించారు.

సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి


గుండిలో జెండా ఎగురవేస్తున్న మర్రి వెంకటస్వామి

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో సీపీఐ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. బుధవారం రామడుగు మండలం దేశరాజుపల్లి, రామచంద్రాపూర్, గుండి గోపాల్‌రావుపేట గ్రామాల్లో పార్టీగ్రామశాఖల మహాసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన పార్టీజెండాలను ఆవిష్కరించి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజలచేతుల్లో తిరుగుబాటుతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, మండల కార్యదర్శి గొడిశాల తిరుపతిగౌడ్, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, మచ్చ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కూలీ రేట్లు పెంచాలి

వీణవంక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హమాలీ సంఘం నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హమాలీ కూలి రెండు సంవత్సరాలుగా పెంచలేదన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా రైతులు, వ్యాపారస్తులతో చర్చించి నూతన కూలిరేట్లు పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో మర్రి రవీందర్, పిల్లి రవియాదవ్, కొప్పుల శంకర్, మంథిని రవి, రెడ్డిరాజుల కొంరయ్య, మేడుదుల శంకర్, పోతరవేన రవిందర్, కమరుద్దిన్, శంకర్, నర్సయ్య తదితరులున్నారు.

మెట్‌పల్లిలో పోషణ పక్వాడ కార్యక్రమం

శంకరపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ-3 సెంటర్‌లో సెక్టార్ లెవెల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యంలో బుధవారం పోషణపక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పల్లె దవఖానా డాక్టర్ మనోచిత్ర, సెక్రెటరీ సరిత, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సునీత, ఏఎన్ఎం సులోచన, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపికైన భూపాలపట్నం యువకుడు

చొప్పదండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన యువకుడు సాత్విక్ ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో అగ్నివీర్‌గా సాత్విక్ ఉద్యోగంలో చేరాడు. ఈ సందర్భంగా సాత్విక్‌ను తహసీల్దార్ నవీన్‌కుమార్ తన కార్యాలయంలో సన్మానించారు. సాత్విక్‌ను ఆదర్శంగా తీసుకుని యువత ఆర్మీలో చేరాలని ఆయన అన్నారు.